




# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 154 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- | గురువారం 09 జనవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## భవిష్యత్తు యుద్ధంలో కాదు..

## బుద్ధుడిలో ఉంది: రష్యా, ఇజ్రాయెల్కు మోదీ సందేశం

యుద్ధంలో భవిష్యత్తు లేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** మానవుడి భవిష్యత్తు యుద్ధంలో లేదని.. బుద్ధుడిలో ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. నేడు ఒడిశాలోని భువనేశ్వర్లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒడిశాలో అడుగడుగునా వారసత్వం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడినుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. “భారత్ ప్రజాస్వామ్యానికి కేవలం తల్లి లాంటిది మాత్రమే కాదు.. అది మన జీవితాల్లో భాగం. విదేశాల్లో జీవించేవారు భారత్కు రాయబారులుగా నేను చూస్తాను.




భారత్ నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జీ20 సందర్భంగా దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేశాం. మన వారసత్వ, విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోంది. భారత్ స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసులు కూడా తోడ్పడ్డారు. ప్రవాస భారతీయులు వచ్చే ఏడాది ఈ ఉత్సవానికి వచ్చే సమయంలో కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతోపాటు తీసుకురండి. భారత్ కేవలం యువ దేశమే కాదు.. నిపుణులైన యువకుల దేశం. భారత్కు ‘విశ్వబంధు’గా గుర్తింపు ఉంది. దానిని మరింత బలోపేతం చేయాలి” అని ప్రధాని మోదీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు వంటి పండుగల సీజన్లో ప్రవాస భారతీయ వేడుకలు జరగడం విశేషమన్నారు. ఈసందర్భంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షుడు క్రిస్టీనే కార్ల వీడియో సందేశం పంపించారు. ఆమె భారత్ పురోగతిని కొనియాడారు. రష్యా, ఇజ్రాయెల్ పేర్లను నేరుగా ప్రస్తావించకుండా భవిష్యత్తు యుద్ధంలో కాదని.. బుద్ధుడిలో ఉందని పేర్కొన్నారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా.. బౌద్ధం స్వీకరించారని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మోదీ ‘ప్రవాసి భారతీయ ఎక్స్ప్రెస్’ రైలును భువనేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ తదితరులు పాల్గొన్నారు.

## భోపాల్ సెంట్రల్ జైలులో చైనా డ్రోన్ కలకలం

మధ్యప్రదేశ్లోని భోపాల్ సెంట్రల్ జైలులో చైనా డ్రోన్ కలకలం సృష్టించింది.



**జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** మధ్యప్రదేశ్లో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. భోపాల్లోని సెంట్రల్ జైలులో ఓ చైనా డ్రోన్ కలకలం సృష్టించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అండా సెల్ గా పిలిచే ఈ జైలులో భయంకరమైన గూండాలు, ఉగ్రవాదులు ఉంటారు. బుధవారం రాత్రి హైరిస్క్ సెల్ వెలుపల ఓ డ్రోన్ ఉండటాన్ని పెట్రోలింగ్ గార్డ్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన గార్డ్ పైఅధికారులకు సమాచారమిచ్చారు. ఆ డ్రోన్ చైనాకు చెందినదిగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అంతేకాక, అందులో రెండు లెన్సులు కలిగిఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ డ్రోన్ ఎక్కడి నుంచి వచ్చింది?, ఎవరికి చెందినది అనే విషయాన్ని సాంకేతిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. భోపాల్ సెంట్రల్ జైలు దేశంలోని అత్యంత ప్రమాదకరమైన జైళ్లలో ఒకటి. ఇందులో వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన 70 మంది ఉగ్రవాదులు హైసెక్యూరిటీ సెల్లో ఉన్నారు. గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం అందరినీ భయాందోళనకు గురిచేస్తుంది. ఈ ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.

## ఫార్ములా-ఈ రేసు కేసు.. కేటీఆర్కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

ఫార్ములా–ఈ రేసు కేసు వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది.

**జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** ఫార్ములా–ఈ రేసు కేసు వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై తక్షణ విచారణ చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై తక్షణ విచారణ అవసరం లేదని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. జనవరి 15న క్వాష్ పిటిషన్పై విచారణ జరుపుతామని వెల్లడించింది. మరోవైపు, ఫార్ములా–ఈ రేసు కేసులో కేటీఆర్ నేడు ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. రేసు నిర్వహణకు ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఇచ్చిన ఆదేశాలపై భారాస నేతను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. అర్వింద్ కుమార్ ఇచ్చిన స్టేట్మెంట్, రికార్డ్ చేసిన అంశాల ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఒప్పందంలో కేటీఆర్ పాత్ర, విదేశీ సంస్థకు నగదు చెల్లింపుల్లో ఇచ్చిన ఆదేశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.



# ఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు..

# అధికారులపై ఆగ్రహం

తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని ఏపీ సీఎం చంద్రబాబు పరిశీలించారు.



**తిరుపతి, జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను ఏపీ సీఎం చంద్రబాబు పరిశీలించారు. విజయవాడ నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి తిరుపతి వచ్చారు. నగరంలోని బైరాగిపట్టెడ వద్ద ఘటనాస్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు.





ఘటనకు గల కారణాలు. ప్రభుత్వం తరపున బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తితిదే ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలన్నారు. “భక్తుల రద్దీ పెరుగుతుంటే తితిదే అధికారులు ఏం చేస-్తున్నారు? ప్రతి ఒక్కరికీ చెబుతున్నా.. బాధ్యత తీసుకున్నప్పుడు దాన్ని నెరవేర్చాలి. తమాషా అనుకోవద్దు” అని వ్యాఖ్యానించారు. భక్తుల రద్దీ చూసి టికెట్లు ఇవ్వాలని తెలియదా? భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాక ఏం చేశారు? అని తితిదే జేఈవో గౌతమిని సీఎం ప్రశ్నించారు. జేఈవోగా మీరు చేయాల్సిన బాధ్యత గుర్తులేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అంబులెన్స్ లభ్యత గురించి సీఎం ఆరా తీశారు. చంద్రబాబు వెంట మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు తదితరులు ఉన్నారు.

## భక్తులను ఒకేసారి క్యూలైన్లలోకి ఎందుకు వదిలారు?: డిప్యూటీ సీఎం పవన్

వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి చేరుకున్నారు.

**తిరుపతి, జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి చేరుకున్నారు. బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కు చేరుకున్న డిప్యూటీ సీఎం.. తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును జేసీ శుభం బన్సల్, డీఎస్పీ చెంచుబాబు పవన్కు వివరించారు. భక్తులను ఎందుకు ఒకేసారి క్యూలైన్లలోకి వదలాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. హైవేకు దగ్గరగా ఉండటంతో భక్తులు పెద్ద ఎత్తున పద్మావతి పార్కు వచ్చారని అధికారులు వివరించారు.



## తిరుపతి స్విమ్స్ బాధితులకు చంద్రబాబు పరామర్శ..

## అండగా ఉంటామని భరోసా

తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు స్విమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు.

**తిరుపతి, జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు స్విమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. తొక్కిసలాటలో గాయపడిన క్షతగాత్రులు దాదాపు 35 మంది స్విమ్స్ చికిత్స తీసుకుంటున్నారు. ఈ బాధితులను సీఎం పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్విమ్స్ వైద్యులతో మాట్లాడిన సీఎం.. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. సీఎం వెంట మంత్రులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో శ్యామలరావు, ఇతర అధికారులు ఉన్నారు.



అంతకుముందు తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను సీఎం పరిశీలించారు. ఘటనకు గల కారణాలు, ప్రభుత్వం తరపున బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తితిదే ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలన్నారు. భక్తుల రద్దీ చూసి టికెట్లు ఇవ్వాలని తెలియదా? భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాక ఏం చేశారు? అని తితిదే జేఈవో గౌతమిని సీఎం ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంబులెన్స్ లభ్యతపైనా సీఎం ఆరా తీశారు.

## సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది.

**హైదరాబాద్, జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్పోర్టును కోర్టుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆరు నెలల పాటు తన పాస్పోర్టు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం.. జులై 6లోగా పాస్పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించి



## మాతృభాషను రక్షించుకోకపోతే..

## అది మన ఉనికికే ప్రమాదం: పురందేశ్వరి

ప్రకృతి పట్ల అవగాహన పెంచుకోవడమే సంక్రాంతి అసలు లక్ష్యమని భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి.

**రాజానగరం, జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** ప్రకృతి పట్ల అవగాహన పెంచుకోవడమే సంక్రాంతి అసలు లక్ష్యమని భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో నిర్వహించిన రెండో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.



తెలుగు సంస్కృతిని అంతా అర్థం చేసుకోవాలని చెప్పారు. మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన ఆరింటిలో తెలుగు ఒకటని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో తెలుగు 15వ భాష అని పేర్కొన్నారు. మన దేశంలో ఎక్కువగా మాట్లాడే వాటిలో నాలుగోది అన్నారు. “దేశ భాషలందు తెలుగు లెస్స అని కృష్ణదేవరాయులు ఏనాడో చెప్పారు. మాతృభాషను రక్షించుకోకపోతే.. అది మన ఉనికికే ప్రమాదం. జీవోలు తెలుగులో ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జీవోలు తెలుగులో ఇచ్చేవారు. మహానదిగా విలసిల్లిన తెలుగు.. ఇప్పుడు పిల్ల కాలువగా మారుతోందని బాధగా ఉంది” అని పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, బత్తుల బలరామకృష్ణ, భాజపా నేత సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్ములా-ఈ రేసు కేసు.. ఈడీ విచారణకు హాజరైన అర్వింద్ కుమార్

ఫార్ములా ఈ–రేసు కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఐఏఎస్ అధికారి అర్వింద్కుమార్ హాజరయ్యారు.

**హైదరాబాద్, జనవరి 9, (రిపబ్లిక్ న్యూస్):** ఫార్ములా ఈ–రేసు కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఐఏఎస్ అధికారి అర్వింద్కుమార్ హాజరయ్యారు. బషీర్ బాగ్ లోని ఈడీ కార్యాలయానికి ఆయన వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు రూ.45.71 కోట్ల బదిలీపై అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఆ కోణంలో అర్వింద్కుమార్ను విచారిస్తున్నట్లు సమాచారం.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **2003:** ప్రవాస భారతీయుల దినోత్సవం, 1915లో మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుండి భారతదేశం తిరిగివచ్చిన రోజు.
- **1922:** నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవ శాస్త్రజ్ఞుడు హరగోవింద్ ఖురానా జననం (మ.2011). (చిత్రంలో)
- **1934:** భారతీయ నేపథ్య గాయకుడు మహేంద్ర కపూర్ జననం (మ.2008).
- **1965:** భారతీయ సినిమా దర్శకురాలు, నటి, కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ జననం.
- **1968:** వెస్టిండీస్‌కు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు జిమ్మీ ఆడమ్స్ జననం.
- **1969:** మొదటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమము ప్రారంభమైనది.
- **1982:** భారత శాస్త్రవేత్తల బృందం మొదటిసారి అంటార్కిటికాను చేరింది.
- **1985:** ప్రముఖ తెలంగాణ జానపద గీత రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్ జననం.
- **2009:** 8వ ప్రపంచ తెలుగు ద్వైవార్షిక మహాసభలు విజయవాడలో ప్రారంభమయ్యాయి.
- **1831:** తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫులేతో కలసి పనిచేసిన విద్యావేత్త, సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జననం.పాధ్యాయురాలు సావిత్రిబాయి ఫులేతో కలసి పనిచేసిన విద్యావేత్త, సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జననం.


మహాత్మా గాంధీ


హరగోవింద్ ఖురానా


మహేంద్ర కపూర్


ఫరా ఖాన్


జిమ్మీ ఆడమ్స్


తెలంగాణా


అంటార్కిటికా


సురేందర్


ప్రపంచ తెలుగు ద్వైవార్షిక మహాసభలు


ఫాతిమా షేక్

రిపబ్లిక్ స్పోర్ట్స్

## విడాకుల వార్తల వేళ.. వైరలవుతోన్న ధనశ్రీ వర్మ పోస్ట్

**చాహల్ దంపతులు విడిపోతున్నారంటూ వార్తలు వస్తోన్న వేళ ధనశ్రీ పెట్టిన పోస్ట్ వైరల్గా మారింది. ఈ వార్తల కారణంగా తాను మానసికంగా ఆవేదనకు గురవుతున్నట్లు చెప్పారు.**



భారత స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ – ధనశ్రీ వర్మ విడాకులకు సిద్ధమవుతున్నారంటూ కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ధనశ్రీ పెట్టిన తాజా పోస్ట్ వైరల్ గా మారింది. కొన్ని రోజులుగా మీడియాలో వస్తోన్న వార్తల వల్ల తాను మానసిక వేదనకు గురవుతున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. "కొన్ని రోజులుగా నేను, నా కుటుంబం కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. నిజానిజాలు తెలుసుకోకుండా అవాస్తవాలు రాస్తున్నారు. నాపై ద్వేషం కలిగేలా ట్రోల్స్ చేస్తున్నారు. ఈ విషయం నన్ను నిజంగా బాధిస్తోంది. నేను ఈ సాధ్యికి రావడానికి ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్నాను. నేను మౌనంగా ఉంటున్నానంటే దాని అర్థం బలహీనంగా ఉన్నట్లు కాదు. సోషల్మీడియాలో ప్రతికూలత ఉన్నప్పటికీ ఇతరులపై కరుణ చూపాలంటే ధైర్యం అవసరం. నేను వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విలువలతో ముందుకుసాగాలనుకుంటున్నా. నిజం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది. దాన్ని సమర్థించుకోవాల్సిన అవసరం లేదు" అని ఇన్స్టాలో పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ధనశ్రీ పోస్ట్ వైరల్ అవుతోంది. కొన్ని రోజులుగా చాహల్ దంపతులు విడిపోతున్నారంటూ వార్తలు జోరుగా ప్రచారవవుతున్నాయి. వీరిద్దరూ ఇన్స్టాగ్రామ్లో ఒకరినొకరు అన్ఫాలో చేసుకోవడం, చాహల్ తన ఖాతా నుంచి సతీమణి ఫొటోలను తొలగించడంతో ఈ ఊహగానాలు మరింత బలపడ్డాయి. చాహల్ – ధనశ్రీవర్మ 2020లో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండే ఈ జంట.. గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. వీరు విడాకులు తీసుకుంటున్నారంటూ వార్తలు గుప్పుమన్నాయి. ఆ తర్వాత స్పందించిన చాహల్ తాము

## లాస్ ఏంజెలెస్లో కార్చిచ్చు.. ఆస్కార్ నామినేషన్లు వాయిదా

**లాస్ ఏంజెలెస్లో కార్చిచ్చు కారణంగా ఆస్కార్ నామినేషన్ల ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో జనవరి 17న ప్రకటించాల్సిన నామినేషన్లను 19కు వాయిదా వేశారు.**




అమెరికాలోని లాస్ ఏంజెలెస్ను కార్చిచ్చు చుట్టుముట్టిన సంగతి తెలిసిందే. దీని ప్రభావం సినీరంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ను తాకింది. దీంతో ప్రస్తుతం అకాడమీలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియ ఆలస్యమైంది. జనవరి 8 నుంచి 14 వరకు ఈ నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. కార్చిచ్చు నేపథ్యంలో దీని ఓటింగ్ ఆలస్యమైంది. దీంతో జనవరి 17న ప్రకటించాల్సిన ఆస్కార్ నామినేషన్లను జనవరి 19కు వాయిదా వేశారు.దాదాపు 10,000 మంది అకాడమీ సభ్యులు ఈ ఓటింగ్ ప్రక్రియలో పాల్గోనున్నారు. జనవరి 8 నుంచి 12 వరకు జరగాల్సిన దీన్ని జనవరి 14 వరకు పొడిగించారు. దీంతో జనవరి 17న ప్రకటించాల్సిన నామినేషన్లను 19న ప్రకటిస్తామని సంస్థ తెలిపింది. 2025 మార్చి 2న ఆస్కార్ వేడుక జరగనుంది.

### ఆస్కార్ బరిలో నిలిచిన భారతీయ చిత్రాలివే..

97వ అకాడమీ అవార్డ్స్ మొత్తం 323 చలన చిత్రాల జాబితాలు ఇటీవల వెల్లడించింది. వీటిలో 207 చిత్రాలు ఉత్తమ చిత్రాల విభాగంలో పోటీ పడనున్నాయి. వీటిలో ఆరు భారతీయ చిత్రాలు ఉన్నాయి. కంగువ (తమిళం), ది గోట్ లైఫ్ (హిందీ), స్వాతంత్ర్య వీర్ సావర్కర్ (హిందీ), ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్ (మలయాళం), సంతోష్ (హిందీ), గర్ల్స్ విల్ బి గర్ల్స్( హిందీ, ఇంగ్లిష్) చిత్రాలు పోటీలో నిలవనున్నాయి. వీటిలో ఎన్ని నామినేషన్ దక్కించుకుంటాయనేది జనవరి 19న తేలనుంది.

### ఆస్కార్కు ప్రియాంక చోప్రా చిత్రం..






2025లో ఆస్కార్ బరిలో నిలిచిన చిత్రాల జాబితాలో ప్రియాంక చోప్రా నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ' షార్ట్ ఫిల్మ్ చేరింది. దీనిపై ప్రియాంక ఆనందం వ్యక్తంచేశారు. 'ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది పిల్లలను ప్రభావితం చేసింది. ఇంత గొప్ప సినిమా ఆస్కార్ బరిలో నిలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది మన జీవిత గమనాన్ని మార్చే సినిమా. ఇలాంటి గొప్ప ప్రాజెక్ట నేను భాగమైనందుకు గర్వంగా ఉంది" అని పేర్కొన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు

**బాలకృష్ణ 'డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది.**



నేడు అనంతపురం వేదికగా జరగాల్సిన 'డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ను రద్దు చేశారు. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో రానున్న చిత్రమే 'డాకు మహారాజ్. సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో అనంతపురంలో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ను నిర్వహించాలని టీమ్ భావించింది. ఆ ఈవెంట్కు ముఖ్యఅతిథిగా ఏపీ మంత్రి, బాలకృష్ణ అల్లుడు నారా లోకేశ్ వస్తున్నట్లు కూడా తెలిపింది. అయితే తిరుపతిలో జరిగిన ఘటన నేపథ్యంలో దీన్ని రద్దు చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది."తిరుపతిలో జరిగిన ఘటనకు మా చిత్రబృందమంతా ఎంతో బాధ పడుతోంది. పవిత్ర స్థలంలో ఇలాంటి ఘటన జరగడం హృదయ విదారకంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రీ రిలీజ్ ఈవెంట్ను జరపడం సరికాదని భావిస్తున్నాం. బాధాతప్త హృదయంతో, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని అత్యంత గౌరవంతో నేడు జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నాం. ఈ కష్ట సమయంలో మీ అందరి మద్దతు ఉంటుందని ఆశిస్తున్నాం" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 41 మందికి గాయాలయ్యాయని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. డీఎస్పీ గేట్లు తెరవడం వల్లే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. విచారణ తర్వాత మరిన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు.

### అత్యంత బాధాకరం: బాలకృష్ణ

తిరుపతి ఘటనపై బాలకృష్ణ స్పందించారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## మోహన్ బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

**సినీనటుడు మోహన్ బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.**



సినీనటుడు మోహన్ బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం సినీనటుడు మోహన్ బాబు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మోహన్ బాబు దాఖలుచేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను గత నెల 23న తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## ఇంటి చిట్కాలు

## తులసి, వేపాకులతో దంతాలపై పాచి వదిలించుకోవచ్చు, ఎలా వాడాలంటే

ఇంకొందరు రోజూ రెండు పూటలా బ్రష్ చేస్తారు. కానీ, వారి పళ్ళు కూడా పసుపు రంగులోకి మారతాయి. ఇక, ఈ సమస్యలు ఉంటే చాలా మంది దంత వైద్యుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తారు. వేల రూపాయల్లో ఖర్చుపెడతారు.

దంతాలు ముఖ సౌందర్యంలో కీలక పాత్ర పోషిస్తాయి. పళ్ళు తెల్లగా ముత్యాల్లా మెరిసిపోవాలని చాలా మంది కోరుకుంటారు. దంతాలు తెల్లగా మెరిసిపోతే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదే పళ్ళు పాచి పట్టి పసుపు రంగులోకి మారితే.. చాలా ఇబ్బందిగా ఉంటుంది. అందరిలో ఉన్నప్పుడు నవ్వడానికి చాలా తంటాలు పడాల్సి ఉంటుంది. ఈ రోజుల్లో చాలా మంది దంతాలు పాచి పట్టి పసుపు రంగులోకి మారిపోతాయి. పళ్ల తోమే విషయంలో బద్ధకం, ఎప్పుడూ పడితే అప్పుడు తినడం, కెఫీన్ ఉండే డ్రింక్స్ ఎక్కువగా తీసుకోవడం, సిగరెట్లు ఎక్కువగా తాగడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారతాయి. ఇంకొందరు రోజూ రెండు పూటలా బ్రష్ చేస్తారు. కానీ, వారి పళ్ళు కూడా పసుపు రంగులోకి మారతాయి. ఇక, ఈ సమస్యలు ఉంటే చాలా మంది దంత వైద్యుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తారు. వేల రూపాయల్లో ఖర్చుపెడతారు. మీరు కూడా పసుపు దంతాలతో ఇబ్బంది పడుతుంటే.. వాటి తెల్లగా మార్చే సహజ ఇంటి చిట్కాలు ఉన్నాయి. కొన్ని సహజ పదార్థాలు, పెరట్లో దొరికే ఆకులు దంతాల పసుపు రంగును తగ్గిస్తాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.



### తులసి ఆకులు



తులసి ఆకుల్లో శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, క్రిమినాశక మూలకాలు ఉంటాయి. ఇవి నోటి ఆరోగ్యాకి ఎంతో మేలు చేస్తాయి. తులసి ఆకుల్ని నమలడం వల్ల దంతాల్ని శుభ్రంగా ఉంచుకోవచ్చు. చిగుళ్ల ఆరోగ్యం కోసం తులసి ఆకుల్ని నమలాలి. తులసి ఆకులు నమలడం ద్వారా దంతాల పాచి కూడా వదిలించుకోవచ్చు.

### తులసి ఆకుల్ని ఎలా వాడాలి?



ఉదయం పళ్లు తోముకున్న తర్వాత 5-6 తులసి ఆకులను నీటితో కడిగి శుభ్రం చేసుకోవాలి. ఆ తరువాత, ఆకులను నెమ్మదిగా నమలండి. తులసి ఆకుల నమలడం ద్వారా అందులో యాంటీ బ్యాక్టీరియల్, క్రిమినాశక మూలకాలు నోటిలోని బ్యాక్టీరియాను తగ్గిస్తాయి. తులసి ఆకుల్ని నమిలి తినవచ్చు. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల దంతాలపై పసుపు రంగు తగ్గిపోతుంది.

### వేపాకులు



చాలా మంది వేప పుల్లల్ని దంతాల్ని శుభ్రపర్చుకోవడానికి ఉపయోగిస్తారు. ఆయుర్వేదంలో వేపాకలు దంతాల ఆరోగ్యానికి ఉపయోగిస్తారు. కావిటీస్, దంత క్షయాన్ని తగ్గించడంలో వేపాకులు బాగా ఉపయోగపడతాయి. వేపాకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ మూలకాలు కనిపిస్తాయి. ఈ మూలకాలు దంతాల్లోని బ్యాక్టీరియాను తగ్గిసాయి. అంతేకాకుండా నొప్పి, వాపు నుంచి ఉపశమనం లభిస్తుంది. రోజూ వేపాకుల్ని నమలడం ద్వారా దంతాలు, చిగళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అంతేకాకుండా దంతాల మీద పాచి, గారె కూడా తొలగిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

### పుదీనా ఆకులు



పుదీనా ఆకుల్ని మౌత్ ఫ్రెషనర్గా వాడుతుంటారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు ఉంటాయి. పచ్చి పుదీనా ఆకులను నమలడం వల్ల దంతాల పసుపు రంగు తగ్గుతుంది. పుదీనాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు దంతాలకు కొత్త మెరుపునిస్తాయి. పుదీనా ఆకులను రోజుకు ఒకటి లేదా రెండుసార్లు నమలడం ద్వారా దంతాల పసుపు రంగును తగ్గించుకోవచ్చు.

### దంతాల పాచికి కారణాలు



- సరిగ్గా బ్రష్ చేయకపోవడం
- పొగాకు నమిలే అలవాటు
- ధూమపానం, మద్యపానం
- ఎక్కువగా టీ, కాఫీ తాగడం
- చెడు ఆహారపు అలవాట్లు
- ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీరు తాగడం
- సోడా, కార్బోనేటెడ్ డ్రింక్స్ తాగడం
- దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ అలవాట్లకు దూరంగా ఉండండి. అంతేకాకుండా రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవడం అలవాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

### గమనిక..

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.